క్లుప్తంగా

పూర్తి నాణ్యతతో రోడ్లు నిర్మించాలి



రహదారి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగర సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన రోడ్ల అభివృద్ధి పనులను పూర్తి నాణ్యతతో పూర్తి చేయాలని కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశాలిచ్చారు. శనివారం రూ.5 కోట్లతో వై.జంక్షన్ నుంచి పుష్కరఘాట్ వరకూ, పుష్కరఘాట్ నుంచి నగరపాలక సంస్థ కార్యాలయం వరకూ చేపట్టిన పనులను కమిషనర్ దినేష్‌కుమార్ తనిఖీ చేశారు. పలుచోట్ల చేపట్టిన రోడ్డు విస్తరణ, తారురోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యత విషయంలో రాజీ పడొద్దని సూచించారు. బీటీ రోడ్డు పనులను వర్షాలు పడక ముందే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ సందీప్, ఎనిమిటీస్ సెక్రటరీలు పాల్గొన్నారు.

పోస్టు భర్తీకి దరఖాస్తులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ స్థానాన్ని భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీనికి సంబంధించి దరఖాస్తు పత్రాలు జిల్లా న్యాయస్థాన అధికారిక వెబ్‌సైట్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నోటీసు బోర్డులో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ నెల 30 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు డిస్ట్రిక్.ఈకోర్ట్.గవ్.ఇన్/ఈస్ట్‌గోదావరి అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు.

విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న గిరజాల బాబు తదితరులు

కడియం: పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన స్థానిక హైస్కూల్ విద్యార్థులను శనివారం ఘనంగా సత్కరించారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా స్థానిక స్కూల్‌లో పి.హరీష్‌నాగదుర్గకు రూ.మూడు వేలు, కె.ప్రియాంకకు రూ.రెండు వేలు, ఎం.ప్రజ్ఞావిక్టర్‌కు రూ.వెయ్యి చొప్పున ప్రోత్సాహకంతో పాటు జ్ఞాపిక, మెడల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు మాట్లాడుతూ ఉన్నత విద్యను పేదలకు చేరువ చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. హెచ్ఎం టి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు శాఖ పట్టాభి, దొడ్డ బుజ్జి, ఆర్ఎస్ఎన్ మూర్తి, దాసరి నాగేంద్ర, శ్రీనివాస్, గుత్తుల వాసు తదితరులు పాల్గొన్నారు.

కొంతమూరులో ఫ్యామిలీ డాక్టర్



రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు నాగదేవి

రాజమహేంద్రవరం రూరల్: కొంతమూరు ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్లో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం జరిగింది. వైద్యురాలు ఇ.నాగదేవి రోగులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అవసరమైన రోగులకు రక్త పరీక్షలు చేశారు. మధ్యాహ్నం ఆరోగ్యశ్రీలో ఆపరేషన్ చేయించుకున్న రోగుల ఇంటికి వెళ్లి పరీక్షలు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారు గొలుసు చోరీ

రాజమహేంద్రవరం రూరల్: తన తల్లి మెడలో బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారని పిట్లవానిచెరువు ప్రాంతానికి చెందిన అమ్మానాన్న ఓల్డేజ్ హోమ్ గుమస్తా అప్పన్నబాబు శనివారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓల్డేజ్ హోంలో అప్పన్నబాబు గుమస్తాగా పనిచేస్తూ అతని తల్లితో కలసి అక్కడే ఉంటున్నాడు. ఫిబ్రవరి 18వ తేదీ రాత్రి తల్లి నిద్రించిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తి రూ.40 వేల విలువైన రెండు కాసుల బంగారు గొలుసు చోరీ చేశారని అప్పన్నబాబు పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు బొమ్మూరు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.విజయకుమార్ కేసు నమోదు చేశారు.

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

ప్రకాశంనగర్: విద్యుత్ చార్జీల పెంపు, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ వివిధ పార్టీల ప్రతినిధులతో ఆదివారం స్థానిక వై.జంక్షన్ వద్ద ఆనం రోటరీ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు తాటిపాక మధు, టి.అరుణ్ తెలిపారు. దీనికి అన్నివర్గాల ప్రజలు హాజరుకావాలని కోరారు.

ప్రగతికి స్త్రీరస్తు

జన్మనిచ్చిన తల్లి.. తోడబుట్టిన చెల్లి.. బతుకు పంచుకున్న కల్పవల్లి.. వీళ్లంతా అతివలే... ఇంటి దీపాన్ని వెలిగించే ప్రమిదలే.. సమాజాన్ని కాంతిమయం చేస్తున్న ఇంతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. వారి ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తోంది.. స్వయం ఉపాధి దిశగా ప్రోత్సహిస్తోంది. దీంతో మేము దేనిలోనూ తీసుకుపోం అంటూ మహిళాలోకం దూసుకుపోతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది.

- డ్వాక్రా మహిళల ఉపాధికి బాటలు
- ప్రభుత్వ ప్రోత్సాహంతో అద్భుతాలు
- వివిధ వ్యాపారాల్లో దూసుకుపోతున్న అతివలు



రాజమహేంద్రవరం పుష్కర ఘాట్‌లో మెప్మా బజార్ (ఫైల్)

రాజమహేంద్రవరం సిటీ: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని డ్వాక్రా మహిళలు స్వయం ఉపాధి దిశగా దూసుకుపోతున్నారు. పురుషులతో సమానంగా రాణిస్తూ కుటుంబానికి కొండంత అండగా నిలుస్తున్నారు. చిన్న ఉపాధి అవకాశాల నుంచి పెద్ద విజయాల వరకూ మేము సైతం అంటూ ముందుంటున్నారు. గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అంతంత మాత్రంగా అవకాశాలు కల్పించడంతో స్వయం ఉపాధి దిశగా ముందడుగు వేయలేకపోయారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి మహిళలకు ప్రాధాన్యం ఇస్తూ స్వయం శక్తితో ఎదిగేందుకు బాటలు వేశారు. దీంతో డ్వాక్రా పొదుపు సంఘాలు చిరు వ్యాపారాలు ప్రారంభించి తోటివారికీ ఉపాధి కల్పించే లక్ష్యంతో ముందుకు వెళుతున్నారు. రాజమహేంద్రవరం నగరంలో 6,345 స్వయం సహాయక సంఘాలు ఉండగా, ఇందులో 63,514 మంది సభ్యులుగా ఉన్నారు. ప్రభుత్వం చేయూత పథకం ద్వారా మొదటి విడత 11,421 సభ్యులకు రూ.2141.44 లక్షలు అందించింది. రెండో విడతలో 13,475 మంది సభ్యులకు మొత్తం రూ.2526.56 లక్షలు, మూడో విడతలో 14,363 మంది సభ్యులకు మొత్తం రూ.2693.06 లక్షలు మంజూరు చేసింది. అలాగే వైఎస్సార్ ఆసరా పథకంలో మొదటి విడత 36,093 సభ్యులకు రూ.2436.53 లక్షలు, రెండో విడతతో 36,803 మంది సభ్యులకు రూ.2555.52 లక్షలు, మూడో విడతలో 36,742 మంది సభ్యులకు రూ.2493.48 లక్షలు అందించారు. రుణాలు పొందిన డ్వాక్రా మహిళలు ఇంటి వద్దే వివిధ రకాల ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వివిధ రకాల దుస్తులు, స్త్రీల అలంకరణ వస్తువులు, జ్యూట్ బ్యాగులు, కొయ్య బొమ్మలు, వైర్ బ్యాగులు, హోమ్ మేడ్ ఫుడ్ ప్రోడక్ట్స్, వెజ్, నాన్ వెజ్ పచ్చళ్లు తదితరాలు తయారీ చేసి విక్రయిస్తున్నారు. వీటిని మార్కెట్‌లో విక్రయించేందుకు ప్రోత్సాహం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో నగరంలో ప్రధాన ప్రాంతమైన పుష్కరఘాట్ వేదికగా నెలలో ప్రతి రెండో గురు, శుక్రవారాల్లో మెప్మా అర్బన్ బజారు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా 16 రకాల షాపులు పెడుతున్నారు. అక్కడ మహిళలు తాము తయారు చేసిన ఉత్పత్తులను తక్కువ ధరకు నగర ప్రజలకు విక్రయిస్తున్నారు. మహిళా ఉత్పత్తులు అమ్మకానికి అవసరమైన బజారును నగరపాలక సంస్థ ఉచితంగా ఏర్పాటు చేస్తుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు చేయూత లభిస్తోంది.

ప్రోత్సాహం మరువలేనిది



నేను మూడేళ్లుగా క్వారీ ఏరియాలో ఆయుర్వేద ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాను. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఉత్పత్తులను తయారు చేస్తున్నాం. మరింత సహకారం అందిస్తే వ్యాపారాన్ని వృద్ధి చేస్తాను. మహిళలకు సీఎం జగనన్న అందిస్తున్న ప్రోత్సాహం మరువలేనిది.

– రెడ్డి ఉమాదేవి, క్వారీ ఏరియా

చిన్నగా మొదలుపెట్టా..



డ్వాక్రా సంఘం ద్వారా వచ్చిన రూ.50 వేలతో జ్యూట్ బ్యాగ్‌లు, తదితర వస్తువులు తయారీని ప్రారంభించారు. ఇప్పుడు నాతో పాటు మరో నలుగురికి ఉపాధి కల్పిస్తున్నాను. పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడే ఉత్పత్తులు తయారు చేస్తున్నాను. ప్రభుత్వం సహాయం మరువలేనిది. రాయితీపై మరిన్ని రుణాలు అందిస్తే వ్యాపారాన్ని విస్తరింపజేస్తా.

– జి.రాధ, రాజమహేంద్రవరం

20న జగన్నాథ రథయాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామాంగ శ్రీనివాస్‌దాస్ తదితరులు

సీటీఆర్ఐ: జగన్నాథ రథయాత్ర మహోత్సవం ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తామని ఇస్కాన్ రామహేంద్రవరం శాఖ చైర్మన్ శ్యామాంగ శ్రీనివాసదాస్ వెల్లడించారు. అదేరోజు పూరి జగన్నాథుని రథయాత్ర ఉంటుందన్నారు. స్థానిక ఇస్కాన్ మందిరం మ్యూజియం హాలులో శనివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా వైభవంగా జరిగే రథయాత్ర కరోనా కారణంగా నిలిచిపోయిందని, ఈ సారి భారీ ఎత్తున చేసేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. దీనికోసం కొత్త రథాన్ని సిద్ధం చేశామన్నారు. ముఖ్య అతిథులుగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరవుతారని శ్రీనివాసదాస్ తెలిపారు. నిత్యం అనేక సమస్యలతో సతమతమవుతూ దేవుని దర్శనానికి కూడా నోచుకోవడానికి ఖాళీ లేనివారిని ఆనంద పరవశుల్ని చేయడానికి జగన్నాథుడే స్వయంగా రథయాత్రగా జనం వద్దకు వస్తున్నట్లు చెప్పారు. జగన్నాథ్, బలదేవ్, సుభద్రలను రథంపై ఉంచి నిర్వహించే ఈ యాత్రలో భక్తులు పాల్గొని తరించాలని ఆయన కోరారు. శ్రీశివానంద నిమాయ్‌దాస్ మాట్లాడుతూ ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు కంబాలచెరువు పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి జగన్నాథ రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. దేవీచౌక్, లక్ష్మీవారపుపేట, కోటగుమ్మం, పుష్కర్ ఘాట్, మార్కండేయ స్వామిగుడి, టి.నగర్, కోటిపల్లి బస్టాండ్, మహాకాళేశ్వర ఆలయం మీదుగా ఇస్కాన్ మందిరానికి చేరుతుందని వివరించారు. కీర్తనలు, భజనలు, ఇస్కాన్ స్వామీజీలు, ముఖ్య అతిథుల సందేశాలు ఉంటాయని ఆయన చెప్పారు. సమావేశంలో హేమ నిమాయ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు

- వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్
- కాతేరులో గడప గడపకూ మన ప్రభుత్వం



కాతేరు మత్స్యకార కాలనీలో పథకాల గురించి వివరిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రతి ఇంటికీ సంక్షేమ వెలుగులు వచ్చాయని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. శనివారం కాతేరు సచివాలయం–1 పరిధి మత్స్యకార కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లతో ఆయన ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. డ్రైనేజీ, తాగు నీటి తదితర సమస్యలను చందన దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్స్యకార కాలనీలో సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా వలంటీర్లు చూడాలన్నారు. ఇటీవల ప్రారంభించిన వ్యవసాయ కళాశాలను నాగేశ్వర్ సందర్శించారు. అనంతరం సచివాలయం–1లో పారిశుధ్య కార్మికులు, సచివాలయ కన్వీనర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. కాతేరు గ్రామాన్ని ఐదు క్లస్టర్లుగా విభజించి పారిశుధ్య కార్మికులతో పనులు చేయించాలని సూచించారు. మరో 20 రోజుల్లో గ్రామంలో పర్యటిస్తానని, అప్పటికి పారిశుధ్య సమస్య కనపడకూడదని అన్నారు. పార్టీ నాయకులు ఆచంట కళ్యాణ్, యెజ్జు వాసు, కొత్తపల్లి నాగేశ్వరరావు, పెనుమాక సునీల్, సురేష్, మద్దా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు. కాతేరులో సరోజిని ఇటీవల మృతిచెందగా కుటుంబ సభ్యులను చందన నాగేశ్వర్ పరామర్శించారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తెలిపారు. బొమ్మూరు వెంకటగిరి కొండ, ముస్లిం ప్రాంతాల్లో రోడ్లు, డ్రైన్‌లకు రూ.20 లక్షల చొప్పున, సోమనవారితోట, మురళీకొండ ప్రాంతాల్లో సీసీ డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి చందన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి వచ్చిన సమస్యల పరిష్కారంలో భాగంగా ప్రతి సచివాలయానికి సీఎం జగన్ రూ.20 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నారన్నారు. నియోజకవర్గానికి స్పెషల్ గ్రాంట్ కింద రూ.20 కోట్లు మంజూరు చేశారని, ఆ పనులను త్వరలోనే మొదలు పెడతామన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, జిల్లా టీఆర్‌యూసీ, దివ్యాంగుల సెల్ అధ్యక్షులు ముద్దాల అను, ముత్యాల పోసికుమార్, మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీను, యెనుముల త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతకు తొలి ప్రాధాన్యం



రిబ్బన్ కట్ చేసి బ్యాటరీ వాహనాలను ప్రారంభిస్తున్న రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్

వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ నాగేశ్వర్

ధవళేశ్వరం: పరిసరాల శుభ్రతకు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. శనివారం ధవళేశ్వరం పంచాయతీలో పారిశుధ్య నిర్వహణకు హిందూస్థాన్ యూని లివర్ లిమిటెడ్, ప్రభాత్ వ్యర్థాల నిర్వహణ ప్రాజెక్ట్ సౌజన్యంతో కేటాయించిన 5 బ్యాటరీ వాహనాలను ఆయన ప్రారంభించారు. ఈ మేరకు స్థానిక బస్టాండ్ వద్ద కార్యదర్శి డి.సూరిబాబు అధ్యక్షత ఏర్పాటు చేసిన బ్యాటరీ వాహనాల ప్రారంభోత్సవానికి చందన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పాతపేటలో ప్రజలకు తడి, పొడి చెత్త సేకరణకు డస్ట్‌బిన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. వాహనాలను అందజేసిన కంపెనీలకు కృతజ్ఞతలు తెలిపారు. హితకారిణి సమాజం డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, వైఎస్సార్ సీపీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్, నాయకులు తలారి వరప్రసాద్, పేర్ల దుర్గాప్రసాద్ (బాసి), ఒంటిద్దు కృష్ణ, చాటకాల చంటి, డాక్టర్ చొల్లంగి సత్యగిరి, మెండా రాజేష్, పసుపులేటి దేవి పాల్గొన్నారు. ఇటీవల కాలికి ఆపరేషన్ చేయించుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు ఎస్‌వీ శేఖర్‌ను చందన నాగేశ్వర్ పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ధవళేశ్వరం రాజీవ్‌నగర్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా రాయి లక్ష్మికి చెందిన ఇళ్లు కాలిపోవడంతో రూ.1.20 లక్షల ఆస్తినష్టం సంభవించింది. ఈ విషయాన్ని నాయకులు గోలిదేవకుమార్, డాక్టర్ చొల్లంగి సత్యగిరి ద్వారా తెలుసుకున్న నాగేశ్వర్ బాధితురాలిని పరామర్శించి ఆర్థిక సాయాన్ని అందజేశారు.

పోరాటాలను స్ఫూర్తిగా తీసుకోవాలి



రక్తదానం చేస్తున్న అఖిలభారత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు సతీష్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కామ్రేడ్ సరోజ్ చౌదరి అసమాన పోరాటాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ సంఘటితంగా ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని ఏఐఈఏ యూనియన్ నేతలు పిలుపునిచ్చారు. అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం (ఏఐఈఏ) ఉద్యమ నేత సరోజ్ చౌదరి వర్ధంతి సభను శనివారం స్థానిక బ్యాంకు కాలనీలోని సంఘ భవనంలో నిర్వహించారు. ఐసీఈయూ అధ్యక్ష, కార్యదర్శులు గుబ్బల రాంబాబు, ఎం.కోదండరామ్, అఖిలభారత ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు పి.సతీష్ మాట్లాడారు. అనంతరం డాక్టర్ వైఎస్సార్, జక్కంపూడి బ్లడ్ బ్యాంక్‌లో 10 మంది రక్తదానం చేశారు. యూనియన్ నేతలు సీహెచ్ సత్యదేవ, ఎ.సుబ్బారావు, ఈశ్వరరావు, బి.శ్రీనివాసరావు, ఎస్.గన్నెయ్య, పి.సాయిబాబా పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న గుండె వ్యాధుల వైద్య నిపుణుడు రామరాజు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక బొల్లినేని ఆసుపత్రిలో శనివారం పీబీఎంవీ వర్క్‌షాప్ జరిగింది. ఇందులో ఒడిశా, తమిళనాడు, ముంబయి, బెంగళూరు, ఢిల్లీతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన గుండె వ్యాధి నిపుణులు, సర్జన్లు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. కిమ్స్ బొల్లినేని హాస్పిటల్ చీఫ్ కార్డియాలజిస్ట్ రామరాజు ఆధ్వర్యంలో ఈ లైవ్ వర్క్‌షాప్ రెండు రోజుల పాటు జరగనుంది. దీనిని జీఎస్ఎల్ అధినేత డాక్టర్ గన్ని భాస్కర్‌రావు ప్రారంభించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ గురుప్రసాద్, సెక్రటరీ డాక్టర్ పిడుగు విజయభాస్కర్, వర్క్‌షాప్ పరిశీలకుడు డాక్టర్ గుడూరు శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేశారు. వర్క్‌షాప్‌లో 90 మందికి పైగా కార్డియాలజిస్టులు మైట్రల్ వాల్వులో ప్లాస్టీ తర్ఫీదు పొందారు. కోర్స్ డైరెక్టర్ డాక్టర్ రామరాజు, డాక్టర్లు ఆర్‌కే జైన్, సి.రఘు, పీవీఎస్ఎం కుమార్, సుజాత, పీకే దాస్‌లు గుండె వ్యాధులకు ఆధునిక వైద్యంపై వివరించారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్య నిపుణులను బొల్లినేని అధినేత డాక్టర్ భాస్కరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ స్వర్ణ రామ్మోహనరావు అభినందించారు.

కాలువల నిర్మాణం వేగవంతం చేయాలి



కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: వర్షాలు పడక ముందే కాలువల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక 25వ డివిజన్ ట్రైనింగ్ కాలేజీ సమీపం, 29వ డివిజన్ కొత్తపేట పల్లపు వీధిలో జరుగుతున్న కాలువల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా కాలువ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట 25వ డివిజన్ ఇన్‌చార్జి అడపా రాఘు, 29వ డివిజన్ ఇన్‌చార్జి కురిమిల్లి శాంతిస్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా సదస్సు

రాజానగరం: దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లడానికి, పరిపుష్టికి, అందుకు కారకులైన మూలు స్తంభాల వంటి మహనీయుల గురించి సమాచారంతో పాటు ప్రముఖుల సలహాలు, సూచనలు తెలుసుకునే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ముంబయిలో గురువారం నుంచి నాలుగు రోజుల పాటు జరిగే నేషనల్ లెజిస్లేచర్స్ కాన్ఫరెన్స్‌కు ఎమ్మెల్యే హాజరయ్యారు. దేశంలో స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకొంటున్న తరుణంలో ముంబయిలో జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో జరుగుతున్న ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా సుమారు రెండు వేల మంది శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు హాజరయ్యారన్నారు. ఇందులో మొదటి రెండు రోజుల అనుభూతిని వ్యక్తపరుస్తూ రాజమహేంద్రవరంలో కార్యాలయం నుంచి ఎమ్మెల్యే శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తొలిరోజు సదస్సుకు హాజరైన పలువురు ప్రముఖులు 'బెల్ ఆఫ్ డెమొక్రసీ'ని మోగించడం ద్వారా కార్యక్రమం ప్రారంభమైందన్నారు. చట్టసభల నిర్వహణ, శాసన సంస్థల బలోపేతం తదితర అంశాలపై యువ శాసనసభ్యులు అనుసరించాల్సిన మార్గాలను సీనియర్ పార్లమెంటేరియన్ల ప్రసంగాల ద్వారా తెలుసుకోగలుగుతున్నామని ఎమ్మెల్యే రాజా అన్నారు. ప్రజాస్వామ్యం పటిష్టత, చట్టసభల సభ్యుల సాధికారత, వివిధ రాష్ట్రాల సభ్యుల కలయిక లక్ష్యంగా ఎంఐటీ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్, భారతీయ ఛాత్ర సంసద్ సంయుక్త భాగస్వామ్యంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు.

వైభవంగా వనువులమ్మ జాతర



వనువులమ్మ జాతరలో ఆకట్టుకున్న శక్తివేషాలు

కడియం: స్థానిక సినిమా రోడ్డులోని వనువులమ్మవారి జాతర మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఏటా గ్రామస్తుల సహకారంతో అమ్మవారి జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం గరగతో గ్రామోత్సవం నిర్వహించారు. శక్తివేషాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు, బాణసంచా కాల్పులు ఆకట్టుకున్నాయి. ఆదివారం అమ్మవారి తీర్థం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

సదుపాయాలు కల్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న లేఅవుట్లలో జులై చివరి నాటికి అన్ని సదుపాయాలు కల్పించాలని కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. శనివారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేఅవుట్లలో నిర్మాణంలో ఉన్న 335 ఇళ్లను వేగంగా పూర్తి చేయించాలన్నారు. కాలనీల్లో రోడ్లు నిర్మించి, విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటు చేయించి, బోర్లు వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అలసత్వం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అదనపు కమిషనర్ సత్యవేణి, హౌసింగ్ కార్పొరేషన్, రూరల్ వాటర్ సప్లై, ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

సంహితలో క్యాంపస్ డ్రైవ్



క్యాంపస్ ఇంటర్వ్యూలకు హాజరైన అమెజాన్ కంపెనీ ప్రతినిధులు

కంబాలచెరువు: స్థానిక తాడితోట జంక్షన్‌లోని సంహిత డిగ్రీ కళాశాలలో ది ప్లేస్‌మెంట్ పార్క్, కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో అమెజాన్ కంపెనీ క్యాంపస్ ఇంటర్వ్యూలను శనివారం నిర్వహించింది. దీనికి సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ షారుఖ్ తీమినేని, హెచ్ఆర్ ప్రవీణ్ హాజరై బీఎస్సీ విద్యార్థులకు ఇంటర్వ్యూలు చేపట్టారు. 425 మంది హాజరు కాగా 79 మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ టి.రామకృష్ణ తెలిపారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. కళాశాల ఏఓ బాలకృష్ణ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రూ.3.80 లక్షల నుంచి రూ.4.80 లక్షల వరకూ జీతం ఉంటుందన్నారు.